

కథ

# కార్యసాధకులు

- యం.ఎస్.వి.గంగరాజు



సత్యన్నారాయణ వ్రతం ఇలా అయిందో లేదో వడ్డనలు మొదలుపెట్టమని తొందర చేశాడు కామయ్యపంతులు. అతను భోజనం చెయ్యడానికి సుమారు అరగంటైనా పడుతుంది. ఆ తర్వాత ఓ గంట భుక్తాయాసం తీర్చుకుని హౌరామెయిల్ అందుకోవాలి మరి! ఖరగ్‌పూర్‌లో ఓ పెళ్లి ఒప్పుకున్నాడు నెలరోజుల క్రితం. వెయ్యినూట పదహార్లూ, చీరా చాపూ! రానూపోనూ రైలు ఖర్చులు అదనం.

పూజా మండపం మీద వేసిన బియ్యం జాగ్రత్తగా సంచిలో వేసుకున్నాడు. పరచిన తమలపాకుల్ని జాగ్రత్తగా దొంతి చేసి ముచ్చికవర్లో పెట్టాడు. రూపాయ బిళ్లల్నీ, పోక చెక్కల్నీ వేరే సంచిలో వేసుకున్నాడు. వ్రత పటాన్నీ, ప్రమిదల్నీ, ఉద్ధరిణినీ, మిగతా సామాగ్రినీ పూజగదిలోకి చేర్చాడు. కొబ్బరి చిప్పల్ని వేరే సంచిలో వేసుకున్నాడు. వ్రతం జరిగిన స్థలం(హాలు) ఖాళీ చేసేసి అక్కడ వ్రతం జరిగింది అనే అనవాళ్లు లేకుండా చేశాడు. పది నిముషాల్లో భోజనానికి స్థలం సిద్ధం అయిపోయింది!

పెరట్లోకి తనే వెళ్లి రెండు అరిటాకులు కోసి, శుభ్రం చేసి తీసుకొచ్చాడు. ఒకటి తనకీ, మరొకటి నాకూ!

ఎక్కడా చిరుగు లేని లేత అరిటాకు కొసలు అడ్డంగా ఒకదాని పక్కన మరొకటి పరచి "అమ్మా ఉమాలూ, త్వరగా వడ్డన మొదలెట్టవూ? మధ్యాహ్నం మెయిలందుకోవాలి. అయ్యా, తమరు పట్టుపంచె మార్చుకుని వచ్చేయండి" అంటూ జాయింట్‌గా హుకుం జారీ చేశాడు మా ఇద్దరికీ.

కామయ్యపంతులు కంఠం ఎంత 'ఖణే'గా ఉంటుందో అతడి భోజనం కూడా దానికేమాత్రం తీసిపోకుండా ఉంటుంది. ప్రతీ పదార్థాన్నీ వ్యాఖ్యానం చేసి మరీ ఆస్వాదిస్తాడు. ఏ వంటకంలో దేనిని మేళవిస్తే రుచి పెరుగుతుందో, దేనిలో దేనిని నంజుకుంటే ఇంకా బాగుంటుందో తన పాతికేళ్ల రీసెర్చి అనుభవంలా చెప్తాడు. భోజనం చేస్తున్నప్పుడు కాలంతో 'కాంప్రమైజ్' అయ్యే ప్రసక్తి లేదు! పంక్తిలోని వారెవరైనా ముందుగా భోజనం ముగించేస్తే, "అయ్యా! మీరు నాకోసం కూర్చోకండి. లేచి చెయ్యి కడిగేసుకోండి" అని పర్మిషనిచ్చేస్తాడు మొహమాటం లేకుండా. 'కేవలం భోజనం చెయ్యడానికే మనిషి పుట్టకపోయినా మనిషి దినచర్యలో ఈ భోజనం అనేది ఒక ముఖ్య ఘట్టం! తృప్తి కలిగేలా ఒక పద్ధతి ప్రకారం భోజనం చేయ్యా' లంటాడు.

'ఆయన అలా సుష్టుగా భోంచేయడం మా ఆవిడ కెంతో ఇష్టం' అనడం కన్నా, 'భోజనం చేస్తూ అతను వదిలే పొగడ్తలు మా ఆవిడ కెంతో నచ్చుతాయి' అంటే బాగుంటుందేమో! (ఆమాట నేనంటే మా ఆవిడ ససేమిరా ఒప్పుకోదు లెండి.) ఆయన అలా భోంచేస్తూ వుంటే తృప్తిగా వుంటుందంటుంది! నిజానికి ఆడవాళ్లని ఐస్ చెయ్యాలంటే 'వంటలు బ్రహ్మాండంగా ఉన్నాయి! (లేకపోయినా సరే) అని ఓ చిన్న కాంప్లిమెంట్ పడేస్తే చాలు! ఈ చిట్కా ఎలా కనుక్కున్నాడో గాని భలేగా పట్టేశాడు కామయ్యపంతులు. భోంచేస్తున్నప్పుడల్లా దానిని మా ఆవిడ మీద సంధించి ఆవిణ్ణి చిత్తు చేసేస్తూ వుంటాడు. అందుకే మా ఇంట్లో ఏ పూజ జరిగినా కామయ్య పంతులు ఖచ్చితంగా ఉండి తీరాల్సిందే!

నాకూ, కామయ్యపంతులకీ అరిటాకుల్లో

వడ్డించింది మా ఆవిడ. పెరుగు ఆవడలు మాత్రం వేరే ప్లేట్లలో పెట్టింది. ఇద్దరమే కనుక వంటకాలన్నీ భోజనాల దగ్గరే పెట్టుకుని కూర్చుంది మారు వడ్డించడానికి (కామయ్యపంతులు కాంప్లిమెంట్లు వినడానికి!)

"తల్లీ, ఈ కందిపప్పుకి ఇంత రుచి ఎలా తీసుకొస్తావో నువ్వు? ఇంకెక్కడా ఈ రుచి ఎరుగను నేను" పప్పూ అన్నం కలుపుకుంటూ మొదటి అస్త్రం సంధించాడు.

మా ఆవిడ మొహం కాంతివంతమైంది. "కందిపప్పు వేపుడు సమపాళంగా ఉండాలండీ. ఎక్కువవేగితే మాడిపోతుంది. తక్కువైతే పచ్చివాసన పోదు. ప్రెషర్ కుక్కర్లో కాకుండా సన్నటి సెగ మీద ఉడకనివ్వాలి. కుంకుడుకాయంత బెల్లం వేస్తే బాగుంటుంది" పప్పు వండడంలో పడ్డ శ్రమంతా మరిచిపోయింది మా ఆవిడ.

"అర్థదీ! ఎన్నోసార్లనుకుంటాను. అడుగుదామని కాని మరచి పోతుంటాను. వంటకాలెన్ని ఉన్నా 'స్వాగత వచనాలు'. పలికేదిదే కనుక పప్పు బాగుంటే ఇక వంటలన్నీ బాగున్నట్టేస్మీ" పప్పన్నంలో నెయ్యి కలుపుతూ అన్నాడు కామయ్య.

రుచికరమైన భోజనంతో పాటు వారి సంభాషణని కూడా ఆస్వాదిస్తున్నాను నేను.

"కొత్త ఆవకాయ.. మొన్ననే పెట్టాను. పప్పన్నంలో నంజుకోండి. బాగుంటుంది" పొంగిపోతూ ఆవకాయ వడ్డించింది మా ఆవిడ.

"ఓహో! రంగు దివ్యంగా ఉంది. బందరు మిరప తెప్పించావుటమ్మా? కాయకూడా చాలా పుష్టిగా ఉన్నట్టుందే! 'గోవా' కాయా, లేక 'బారామాసీ'యేనా?" వడ్డించిన ఆవకాయ వైపు ఆత్రంగా చూస్తూ అన్నాడు కామయ్య.

"బారామాసీ కాయేనండీ. మాడుగుల ఆవాలూ, అనకాపల్లి పప్పునూనె తెప్పించి వేశాను."

"భేషుగ్గా ఉంది. మరో రెండు ముక్కలూ, కాస్తంత పిండి వెయ్యమ్మా. పప్పన్నం తిన్నాక దీని సంగతేదో చూడాలి మరి. నువ్వేన్నని చెప్పు, ఒక్కొక్కరి హస్తవాసి తల్లీ! నీ చేత్తో ఏం చేసినా అమృతతుల్యమే సుమీ"

మా ఆవిడ పూర్తిగా చిత్తైపోయింది! చిన్నజాడీ లోంచి మూడు ముక్కలూ, గరిటెడు పిండీ కామయ్య పంతులు ఆకులోకి జారి తమదే అగ్రస్థానం ఆకులో ఉన్న పదార్థాలన్నింటిలోనూ అనిపించుకున్నాడు. ఆ తర్వాత మరో గరిటెడు ఆవకాయ (పిండి) అదనంగా వేయించుకుని, దానికి ఒక గరిటెడు నెయ్యి మేళవించి మరీ ఆరగించాడు కామయ్య. ఆవకాయ అన్నం అదనం అయిపోవడం వలన పెరుగు ఆవడలకీ, పులిహోరకీ, గుత్తివంకాయ కూరకీ పెద్దగా న్యాయం చెయ్యలేకపోయాడేమో అనుకున్నాను.

మా ఆవిడ కూడా అదే పసిగట్టినట్టుంది "ఆవడలూ, పులిహోరా మారు వడ్డించనివ్వలేదు బాగులేవా, ఏమిటి పంతులుగారూ" అంది కాస్త నొచ్చుకుంటూ.

"అమ్మమ్మ! ఎంత మాటన్నావు తల్లీ? సాక్షాత్తూ కాశీ అన్నపూర్ణవి నువ్వు. దుర్భిణి పెట్టి వెదికినా నీ వంటకాల్లో లోపం కనిపించదు. ఇదిగో, ఈ అమృతంతో కడుపు నిండిపోయింది. మరొక్క ముక్క రాల్చు తల్లీ పెరుగన్నంలోకి" పెరుగన్నం కలుపుతూ అన్నాడు కామయ్య.

'అర్జున' అవార్డు పొందిన క్రీడాకారుడు పతకాన్ని ఆనందంతో చూసుకున్నట్టు ఆవకాయ జాడీని చూసింది మా ఆవిడ! ఆప్యాయంగా జాడీ అందుకుని మరో రెండు ముక్కలు వేసింది కామయ్య పంతులు ఆకులో.

అతను ఆవకాయని అంతగా మెచ్చుకోవడం చూసి "పోనీ ఓ సీసాలో వేసి కాస్త ఆవకాయ ఇయ్యవోయ్ పంతులుగారికి" అన్నాను నేను, భోజనం పూర్తి చేసి లేస్తూ.

ఎగిరి గంతేసినంత పని చేశాడు కామయ్య. "అమ్మా ఉమాలూ! మేనేజరు గారి ఆజ్ఞ అయిపోయింది. ఓ సీసాలో కాస్త ఆవకాయ ఇయ్యమ్మా. వెధవ నాలుక! ఒకసారి రుచి మరిగాక పదే పదే దానినే కోరుతుంది" అన్నాడు 'తప్పు నాది కాదు, నాలికది' అనే ధోరణిలో.

"సరేలెండి. ఆవకాయ ఇవ్వడానికి కూడా ఆయన ఆజ్ఞ కావాలా, ఏమిటి?" అంది మా ఆవిడ కొంత క్రెడిట్ నాకెక్కడ దక్కిపోతుందో అనుకుని కాబోలు!

"ఇద్దరికిద్దరూ ఒకటే తల్లీ మీరు. అందుకే మిమ్మల్నిద్దర్నీ చూస్తూ వుంటే సాక్షాత్తూ ఆదిదంపతులని చూసి నట్టుంటుంది నాకు. ఇవాళ ఏకాదశి! నాలుగు అభిషేకాలు వదులుకుని వచ్చాను మీ ఇంటికి."

అతని మాటలో పొగడ్తావుంది 'భోజనం అయ్యాక ఇచ్చే దక్షిణ కూడా 'దర్జాగా' ఉండాలి సుమీ' అనే హెచ్చరికా వుంది.

"ఓ వారంరోజులు నీపేరు చెప్పుకుని తినేలా ఉండాలమ్మోయ్" అన్నాడు కామయ్య చేతులు కడుక్కుని వచ్చి 'ఆవకాయ కాస్త పెద్దసీసాలో ఇవ్వాలి సుమీ' అనే అర్థం వచ్చేలా.

దండిగా ఇచ్చిన దక్షిణా, ఆవకాయ సీసాతో బాటూ మిగిలిన సంచులందుకుని ఆదరాబాదరాగా వెళ్లిపోయాడు కామయ్య.

మా ఆవిడ భోజనం ఆ పూట పప్పూ అన్నంతో బదులు ఆవకాయ అన్నంతో ఆరంభమవ్వటం పేపరు చదువుతూ కూర్చున్న నేను చాటుగా గమనించక పోలేదు.


000

కొన్ని రోజుల తర్వాత మా కొలీగ్ ఇంట్లో వాళ్లబ్బాయి 'అన్నప్రాసన'కి లంచ్ అవర్లో సరాసరి బాంకు నుంచే బయలుదేరాను. నేను చేరేసరికి మొదటి విడత భోజనాలయిపోయాయి. పక్క గదిలో నాతోపాటు లేటుగా వచ్చిన కొద్దిమంది మిత్రులకూ వడ్డనలు చేశారు.

హాల్లోంచి పరిచయమున్న కామయ్య పంతులు మాటలు 'ఖణీ'గా వినిపిస్తున్నాడు. "... ఆవకాయంటే ఇదీ! మహా గొప్పగా ఉంది. మొన్న ఏకాదశినాడు సత్యన్నారాయణ వ్రతం చేయించడానికి ఒకరింటికెళ్లాను. అక్కడ వేశారు ఆవకాయ! ఒక రుచా, పచా? ఇక పదిరోజుల వరకూ ఈ ఆవకాయతోనే నా భోజనం తల్లీ" అంటూ ఆవకాయ సీసా చేత్తో పట్టుకుని వెళ్లిపోతున్న కామయ్య పంతుల్ని కర్టెను సందుల్లోంచి నిర్ఘాంతపోయి చూస్తూ ఉండిపోయాను.

## తెల్లజుట్టు హీరో?!

ఇటీవల ముంబయిలో జరిగిన ఓ పార్టీకి బాలీవుడ్ హీరో అనిల్ కపూర్, తన భార్యతో సహా హాజరయ్యాడు. ఆ వచ్చేదెలాగొచ్చాడూ అంటే తలకు హెయిర్ డై వేసుకోకుండా. నగం నెరిసిపోయిన అతని జుట్టు చూసిన అతని దగ్గరి మిత్రుల్లో ఒకరెవరో చటుక్కున, "ఇవాళ వదిన గారు ఒరిజినల్ అనిల్‌నే పార్టీకి పంపించారే? జుట్టుకు రంగేసుకోకుండా అసలెప్పుడూ బయటికి పంపరు కదా" అని జోకేశాట్ట. అతనే ఉద్దేశంతో అన్నాడో తెలియదు గానీ, దానికి మండిపడ్డ అనిల్, "ప్రతి పనీ నా భార్యతో చెప్పేమీ చెయ్యన్నేను. అయినా పనికిమాలినవన్నీ పబ్లికున చర్చించమని నీకెవడు చెప్పాడో?" అని అతని మీద విరుచుకుపడి, అతి వేగంగా భార్య చెయ్యి పట్టుకుని అక్కడి నుంచి లాక్కుంటూ మరీ నిష్క్రమించాట్ట. నగం తల నెరిసినా తన వయసులో నగం వున్న కుర్ర హీరోయిన్లతో ప్రేమకథల్లో నటిస్తుంటాడు కదా, మరి వున్నమాటంటే, ఎందుకొచ్చింది?



ఎన్.

ఆరోజు మా ఆవిణ్ణి అక్కడకి తీసుకెళ్లక పోవడం, అప్పటివరకూ నేను చేసిన మంచి పనుల జాబితాలో ఒకటిగా నమోదు అయిపోయే ఉంటుంది! ■